

# నాలుగో కోతి

కాటూరు రవీంద్ర - త్రివిక్రమ్

"మీకు పువ్వు అంటే ఎక్కువిష్టం?

"ఏం? జ్యోతిష్యం చెబుతారా?" నవ్వుతూ ఎదురు ప్రశ్నించింది రోహిణి.

విష్ణు కూడా నవ్వి –

"అఫ్‌కోర్స్ మనస్తత్వం చెప్పగలను! మనస్తత్వాన్ని బట్టే మన తత్వాన్ని రూపొందించుకుంటాం. మన భవిష్యత్తుకి పునాదిరాళ్ళు మన తత్వమూ, మనస్తత్వమే!"

"నిజానిజాల సంగతెలావున్నా, వింటానికి మీ మాటలు చాలా బావున్నాయ్!"

"థాంక్స్ ఫర్ ది కాంప్లిమెంట్! ఇంతకీ నేనడిగిన ప్రశ్నకు మీరు సమాధానం చెప్పలేదు—"

"దాంట్లో పెద్ద విశేషం ఏముందండీ? ఆడవాళ్ళు సహజంగా పూలంటే మక్కువగా ఉంటారు. ఏ పువ్వు కంటికి రమ్యంగా ఉన్నా, ఏ కుసుమ పరిమళం పట్టి నిలిపినా ఆశపడతారు."

"మీరు డొంకతిరుగుడుగా మాట్లాడొద్దు. దటీజ్ వెరీ బాడ్."

గలగల నవ్వేసింది రోహిణి.

"చెప్పండి – ఏ పువ్వంటే ఎక్కువ మక్కువ మీకు?" విష్ణు మళ్ళీ అదే ప్రశ్న వేశాడు.

ఆమె క్షణంసేపు సాలోచనగా శూన్యంకేసి చూసి "ఊఁ" అని అంటూ దీర్ఘంతీస్తూ "ఆఁ....మల్లె పువ్వండీ.... మల్లెపువ్వంటే నాకు చాలా యిష్టం! ఇప్పుడు చెప్పండి, నా మనస్తత్వం ఏమిటో....దాంతోబాటు నాజాతకుంకూడా చెప్పండి...." అంటూ చెయ్యి చాచింది.

దాన్నందుకుని రేఖలకేసి దీర్ఘంగా, గంభీరంగా చూశాడు.

"వెరీ నైస్...."

"ఏమిటా నైస్! వివరంగాచెప్పండి" అంది రోహిణి.

"బంగారు లోయలాంటి భవిష్యత్ ఉంది మీకు."

"రాత్రి రెండో ఆటకి మెకన్నాస్ గోల్డ్‌కి వెళ్ళొచ్చారేమిటి?" వ్యంగ్యంగా అంది.

"అదేం?" అన్నాడుఆశ్చర్యపోతూ.

"బంగారు లోయ అంటుంటేనూ – మరి కాస్సేపాగితే గుర్రాల పరుగు సంగతికూడా చెప్పేట్లున్నారు..." మెల్లిగా చెయ్యి వెనక్కు తీసుకుంది రోహిణి.

కుర్చీలో వెనక్కివాలి, చిరునవ్వు నిండిన మొహంతో సిగిరెట్ వెలిగించుకుని తాపీగా పొగవదుల్తూ అన్నాడు విష్ణు.

"కన్నెపిల్ల సమక్షంలో మనసు వయసు గుర్రమై పోతుందోయ్ – అన్నాడో కవి. గుర్రాల మాటెత్తక పోయినా, ఇప్పుడు నా మటుకు నాకు రెక్కల గుర్రంమీద కూర్చున్నట్లే ఉంది."

"ఎందుకనో?"

నవ్వేడు విష్ణు.

"ప్రశ్న చాలా చిన్నది. జవాబు చాలా పెద్దది."

"చెప్పండి, వింటాను..." కుతూహలంగా బుగ్గన చెయ్యి చేర్చుకుంది రోహిణి.

"దేన్నయితే దేవదాసు, మజ్నూ రోమియోలు పోగొట్టుకొన్నారో–అలాంటిది నాకు సులభంగా దక్కుతున్నప్పుడు యింకెలా ఉంటుంది?" ఆమెకేసి చిలిపిగా చూస్తూ అన్నాడు విష్ణు.

రోహిణి కొద్ది క్షణాలు మౌనంగా, గంభీరంగా ఉండిపోయింది.

"ఏమైంది? సడన్‌గా ఎందుకలా అయిపోయారు?"

"నా కేమిటో భయంగా ఉంది!"


"నాన్సెన్స్!" కొట్టిపారేశాడు. "ప్రేమ ఉన్నచోట భయం ఉండదు. ఒకటి ముంగిస, రెండోది పాము!"

"నేనలా అనుకోలేకపోతున్నాను," అంది తలదించుకుని.

"డోన్ట్ వర్రీ! మీ భయంనాకుతెల్సు. మీ గార్డియన్‌గా ఉంటున్న బాబాయినుండి ఏదన్నా చిక్కులు రావచ్చనేగా...."

'అవును' అన్నట్లుగా చూచింది రోహిణి.

"లీవిట్‌టూమి. పవర్ ఆఫ్ అటార్నీ నా పేర్న రాసెయ్యండి. దెన్ యూ సీ




హౌ ఐ విల్ ట్రాప్ హిమ్...పంజరంలో పిట్టని చేసేస్తాను," పిడికిలి బిగించాడు విష్ణు.

రోహిణి మనసు కొద్దిక్షణాలు అటూ ఇటూ కొట్టుకొంది. విష్ణుని ఎంతవరకు నమ్మవచ్చు?

ఎంతవరకు నమ్మకూడదూ?

మనిషి అందగాడే! ఆడపిల్లల మనసు చెడగొట్టుకోగల అందం అతనిది. ఆ అందం అంతరంగానికి కూడా ఉందా?

ఒక్కమాటు అతనితో పరిచయాన్ని పునశ్చరణ చేసుకుంది.

కాలేజీ బ్యూటీ కాంతిరేఖ తనకి పోటీగా కాలేజి ఎలక్షన్లో నిలబడింది.

ఆమెకి అందం తప్ప మరే అర్హతా లేదు.

తనకి అందం సామాన్యమే అయినా మిగతా అర్హతలన్నీ ఉన్నాయి. అన్నింటినీ మించి అయిదుతరాలు అనందంగా బ్రతగ్గల ఆస్థి ఉంది! తల్లిదండ్రులు బదరీయాత్రలో భగవంతునిలో ఐక్యమైపోవటం, ఆ క్షణంనుండీ పినతండ్రి గార్డియన్‌గా పెత్తనం చలాయించడం మినహా తనకే కష్టమూ లేదు. బాబాయి కూడా ఆరితేరిన ముసలి విలన్‌లా, డిప్లొమాటిక్‌గా 'అమ్మా, తల్లీ' అంటూనే గోతులు తీస్తాడు.

'ఏమిటీ గోతులు బాబాయ్?' అనడిగితే—

"అవా? అందులో పూలమొక్కలు నాటుదామనుకుంటున్నాను తల్లీ...."

అంటాడు తాపీగా.

పువ్వుల్నే నాటతాడో, పూల మొక్కల్నే నాటతాడో వేచిచూడాలి....

కాంతిరేఖని కేవలం తనంటే అసూయతో మండిపోయే కొలీగ్స్ నిలబెట్టారని తనకి తెలుసు.

అది తన 'ప్రిస్టేజ్ క్వొశ్చన్' అయి కూర్చుంది.

ఒకవేళ ఓడిపోవడమే జరిగితే కాలేజీకి 'గుడ్‌బై' చెప్పెయ్యాలనికూడా నిర్ణయించుకుంది.

మగపిల్లల ఓట్లు పడితే తను గెలిచేస్తుంది. ష్యూర్!

కానీ – కాంతిరేఖ చిరునవ్వుల వలలో యిరుక్కుపోయిన వాళ్ళనెలా తనవైపు తిప్పుకోవడం?

తనకు తానుగా అడిగితే గెలిచేస్తారేమో....

మొహాన్నే నవ్వేస్తారేమో....

అలాంటి క్షణంలో – ఆశాకిరణంలా వచ్చి, తనకు తానుగా పరిచయం చేసుకొన్న సీనియర్ స్టూడెంట్ విష్ణుని పూర్తిగా నమ్మక తప్పలేదు. అతను 'విజయం తథ్యమని హామీ యిచ్చాక, మంచినీళ్ళలా డబ్బు ఖర్చుచెయ్యమని నోట్లకట్ట లిచ్చింది.

మొదట బాబాయి గొణిగినా, సణిగినా అవరికి తనడిగినంతా యిచ్చేడు. కాంతిరేఖ ఓడిపోయింది.

ఓహ్....ఆ రోజు తనకి ఆకాశాన్ని గెలిచినంత ఆనందం!

సముద్రాన్ని ఈదినంత సంతోషం.

దీనికంతా కారణమైన విష్ణుని అమాంతం కౌగలించుకొని వెయ్యి ముద్దులిచ్చేద్దామనిపించింది ఆవేశంలో!

తనని చాటుగా ద్వేషించిన వాళ్ళంతా గెలిచానని తెలిసాక ఎదురుగావచ్చి ఏమీ కానట్లే జేజేలు కొడుతుంటే, కుళ్ళిపోయిన వాళ్ళ ఆత్మల్నిచూసి గర్వంగా నవ్వుకుంది.

కాంతిరేఖ కాలేజీ మానేసిందని తెలిసాక తన మనసులో చెలరేగిన తుఫాను చల్లారింది!

అప్పుడు కథ కొత్తమలుపు తిరిగింది.

విష్ణు ఓ సాయంత్రం జమాఖర్చుల జాబితాతో వచ్చి – (సారీ....అతను యింకా తనని నువ్వనేదాకా రాలేదు!) మీరిచ్చిన డబ్బుకి నేను చేసిన ఖర్చు వివరాలివి....మిగిలిందింత – అంటూ రెండొందలివ్వబోయేడు.

తనే మరో మూడొందలిచ్చి, "ఈ అయిదొందలతో నన్ను గెలిపించిన మీ మిత్రులందరికీ గ్రాండ్ పార్టీయివ్వండి.." అంది.

విష్ణు నవ్వి "ఆల్‌రైట్" అని తీసుకొన్నాడు.

అటు తర్వాత విష్ణు తనకి చాలా చేరువైనాడు.

అతనికి అప్పటికే తన గురించి చాలా విషయాలు తెలుసుననే సత్యం అర్థమయింది.

ఆ కుతూహలం వెనక ఏముందీ?

అతను చూపుతున్న సిన్సియారిటీ ఆషాఢభూతి ముసుగా లేక అందులో వాస్తవం ఉందా?

తను గొయ్యిని తప్పించుకొని, నుయ్యిలో పడటం లేదు కదా?

ఇలాంటి భయాలూ, భావాలూ - ఆమె మనసును 'సాండ్విచ్' చేసేశాయి. అందుకే ఎంత చేరువగా ఉందో, అంత దూరంగా ఉంచింది!

విష్ణు ప్రతిమాటా ఆమెని 'మెస్మరైజ్' చెయ్యాలని జాగ్రత్తగా ఎంచి, తూచి మాట్లాడేవాడు.

నిజానికవి సమ్మోహితంగానే ఉండేవి.

కానీ -

అప్పుడప్పుడూ ఆమెకొక విచిత్రమైన ఊహ కలుగుతుంటుంది.

ఒక మాటెక్కడికో వెళ్తే - "ఇతను అచ్చం ఘంటసాలలాగా పాడతా" డన్చెప్పి, ఓ కుర్రాడిచేత పాట మొదలెట్టించారు. మొదట గొంతు బిగించి, ఎలాగోలా ఘంటసాలను గుర్తుచేసినా, పోనుపోను పీలగామారి, అసలు గొంతు వికృతంగా బయటపడింది!

మనుషుల తత్వాలూ యిలాగే బయట పడతాయేమో అనుకుందా క్షణంలో. అటుతర్వాత చాలామాట్లు ఆమెకు ఆ సంఘటన గుర్తొచ్చి నవ్వుకుంది.

ఇప్పుడిప్పుడు విష్ణుమాటలు వింటుంటే అతని అంతరంగంలోకి తొంగిచూచి అక్కడ అమృతమే ఉందో, హాలాహలమే ఉందో తేల్చుకోవాలనుకొన్నప్పుడు మరీ గుర్తొస్తోంది పాత సంఘటన.

తనీ సస్పెన్స్ లోంచి బయట పడాలి....

విష్ణుని 'నేకెడ్'గా చూడాలి.


కానీ - ఎలా?

పైగా సమస్య యింకోటీ, యింకోటీ గాదు. చివరికిది తన జీవిత సమస్యగా మారి కూర్చుంది.

అనేక విధాల అతన్నిగురించి వాకబు చేసింది.

ఎవరూ ఎక్కడా అతని గురించి చెడుగా చెప్పలేదు.

పిచ్చిపిచ్చి ఊహలతో మనసు పాడు




చేసుకుంటున్నానేమో అన్పించింది. ఇటీవల ఆమెకి ఒక కొత్త కథ తెల్సింది. కాంతిరేఖ విష్ణుని ఏకధాటిగా ప్రేమించి మనసిచ్చినా అతను కాదనేశాట్ట!

వాటే వండర్!

తనే మొగాడయితే, కాంతిరేఖను వదులుకోవటం జరిగేదా?

ఇపాసిబుల్....

కానీ - విష్ణు ఎందుకు వదులుకున్నాడో?

అందుకు కారణం తనేనా?

అది ప్రేమా - ఆరాధనా - వగైరా, వగైరా క్రిందకొస్తే, దేవుడు తనకి మంచి గీతలే గీసినట్టు!

ఎగ్జాక్ట్లీ!

(ధర్మారావు మాస్టారి పాత్ర లేకపోతే ఈ కథ ఇక్కడితో పూర్తయేది. పాతకుణ్ణి అనవసరంగా విష్ణు, రోహిణీల పెళ్ళికి శుభలేఖ లేకుండా తీసుకెళ్ళి, అసలు విందు లేకుండా ఒట్టికనువిందుతో 'సింబాలిక్'గా శోభనం సీను చూపించి 'శుభం' అనటం లాంటి పాత సంప్రదాయానికి తలవంచటం ఇష్టంలేని రచయిత కథని మలుపు తిప్పుతున్నాడు—)

* * *

"అవునమ్మా....నా పేరే ధర్మారావు! నిజమే....విష్ణు నా దగ్గరే చదువుకున్నాడు....నువ్వు శ్రమపడి, యింత దూరం నా దగ్గరకొచ్చి అతని గురించి అడుగుతున్నావంటే అందుకు మామూలు కారణం ఉంటుందనుకోను....అవునా?"

"మీ ఊహ కరక్టే!" ఒప్పుకొంది రోహిణి.

ధర్మారావు ఓ ముసలినవ్వు నవ్వేడు.

ఆ నవ్వు పవిత్రంగా తోచి, ఆమెకి కాస్త ధైర్యం కలిగింది.

సమాధానం కోసం ఆయన వంకే చూడసాగింది.


"అవేమిటో నీకు తెలుసు కదూ?" అంటూ వేలితో చూపాడు! రోహిణి కంటికి గాంధీగారి మూడు కోతులు కన్పించాయి.

తెలుసన్నట్లు తలాడించింది.

ఆయన రామాయణ కాలంనాటి చెక్కడ్రాయర్లోనుంచి, వెతికి వెతికి ఓ ఫోటో తీశారు.

ఆమెకి దాన్ని చూపిస్తూ "యిది విష్ణుదేనని నీకు చెప్పాలి. ఎందుకంటే ఎప్పుడో స్కూల్ఫైనల్ పరీక్షకోసం తీయించుకున్న ఫోటో యిది. పోలికలు వెంటనే తెలియవు...." అన్నాడు అలాగే పట్టుకొని.

కాస్త కష్టంమీద పోలికలు గుర్తించి




"ఎస్, కరెక్టు! ఇది విష్ణు ఫోటోనే...." అంది రోహిణి.

"దీన్నిప్పుడు యిక్కడ ఉంచుతాను...." అంటూ మూడు కోతుల పక్కన ఉంచాడు. "ఎందుకలా ఉంచానో చెప్పుకో...." అన్నాడు పాత కళ్ళజోడు లోంచి చూస్తూ.

ఆమెకి ఫక్కున నవ్వొచ్చింది.

"నవ్వకు - యిది చాలా సీరియస్ విషయం!" అన్నాడు ధర్మారావ్ మొహం సీరియస్‌గా పెట్టి.

"మీరే చెప్పండి నేను వింటాను...." అంది నవ్వాపుకొని.

మనసులో 'ఈయన భలే టీచరు' అనుకుంది.

ఆయన మొహంలో కాస్త 'డిస్సప్పాయింట్‌మెంట్' కన్పించింది. నిట్టూరుస్తూ కూర్చుని నోరు విప్పాడు-

"మై లిటిల్ బేబీ! పువ్వులన్నీ క్రూరంగా నలిగిపోవటానికే. ఆడపిల్లల జీవితాలన్నీ మగవాళ్ళ మోసానికి కర్కశంగా చితికిపోవటానికేనని ఎవరన్నా, ఎప్పుడన్నా చెప్పారో లేదో నేనెరుగను. ఇప్పుడీ ముసలి మాస్టారు ధర్మారావ్ చెబుతున్నాడు. నీ మనసు మీద రాసుకో...." అంటున్నప్పుడు ఆయన గొంతు వొణికింది.... కళ్ళజోడు జారింది. మందాకినిలాంటి ఆయన మనసు వశం తప్పి, గట్లుతెంచుకొన్న బాధ కళ్ళల్లోంచి వెలికి దుమికింది.

చూస్తున్న రోహిణి మనసులో ఎందుకో ఎర్రబల్బు వెలిగింది.

ఆమె కర్థమైపోయింది—

ధర్మారావ్ మాస్టారు చెప్పబోయే కథ నాలుగు మాటల్లోనే తెల్సిపోయింది.

"వద్దు మాస్టారూ! మీ గుండెలు చీల్చుకువచ్చే ఏ కథా నేను వినే స్థితిలో లేను.... ప్లీజ్.... ఒక్కమాట స్పష్టంగా చెప్పండి. విష్ణుని ఆడపిల్లలు నమ్మొచ్చా లేదా? అదే నేను వినదల్చుకున్నది...."

నవ్వేడు ధర్మారావ్.

"అర్ధచంద్రుడి వెలుగూ, అసంపూర్ణమైన విజ్ఞానమూ ఎలాంటి ప్రయోజనాన్నీ ఇవ్వలేవు తల్లీ! నేను చెప్పేది ఓర్పుగా చివరిదాకా విను.... అంతవరకూ మాట్లాడకు...."

రోహిణి మూగబొమ్మలా ఉండిపోయింది.

ధర్మారావు మాస్టారి పాఠం మొదలైంది!

"చెడు వినకు, కనకు, మాట్లాడకు— అనే గాంధీగారి ఆదర్శాన్ని నమ్మిన వ్యక్తిగా జీవితాన్ని గడుపుతూ వచ్చిన నాకు.... కొన్నాళ్ళ అనుభవం తర్వాత.. నేనే వ్యక్తిని యీ మూడు ఆదర్శాలతో తీర్చిదిద్దాననుకొన్నానో .... కోతిలాంటి మనసుకున్న మూడు దుర్గుణాల్నీ వదిలించగలిగానని అనుకున్నానో... ఆ వ్యక్తిలో మరో కొత్త కోతి.... నాలుగో కోతి బలంగా ఎదుగుతోందని తెల్సుకొనేసరికి ఒక అమాయక జీవితం బలి అయిపోయింది!

అటు చూడు...గోడకున్న ఫోటోలో... అవును—ఫోటోగానే మిగిలిపోయిన నా కూతురు రాజ్యాన్ని ఆ కోతి బలి తీసుకుంది. చెడ్డతనం మరకలైనా కన్పించని అందమైన ఆకారం, అద్భుతమైన మాటల గారడీతో అమ్మాయిల జీవితాలకి చిచ్చుపెట్టుగల ఆ కోతి విష్ణేనమ్మా.... ఆ రాక్షసుడివల్ల నా జీవితంలో శాశ్వతంగా వెలుగు మలిగిపోయింది. రాజ్యంకోసం దిగులుపడి కన్నుమూసిన భార్యతోపాటు వెళ్లలేని అసమర్థతతో, యింకా పాత స్మృతుల మధ్య కాటికాపరిలా కూర్చున్నాడమ్మా ఈ ధర్మయ్య మాస్టారు.... నీకు చాతనయితే వేలు.... కాదు లక్షల కొద్దీ నాలుగో కోతుల్ని చేయించు తల్లీ. అవి విష్ణుమూర్తి లాంటి దుర్మార్గుల్ని వెలెత్తి చూపాలి....'గాంధీజీ! నీకు తెలియని నాలుగోకోతి ఒకటుందయ్యా' అని కుమిలిపోయే నాలాంటి అభాగ్యుల ఆత్మశాంతి కోసమయినా ఆ పని చెయ్యి తల్లీ.... గాంధీగారు కోతిలాంటి మనసుకి ప్రతిరూపాలుగా దిద్దిన మూడుకోతులూ చెడు కనకు, వినకు, మాట్లాడకు మనే చెప్పాయి. నువ్వు చేయించే కోతి "చెడు చెయ్యకు"— అని ఆకాశందాకా అరిచి చెప్పాలి.... సముద్రాలు ఘూర్ణిల్లేలా గర్జించి మరీ చెప్పాలి తల్లీ ...."